అనుక్షణం ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..





**మళ్లీ మొదటికొచ్చిన పశ్చిమసియా !**

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -31 మంగళవారం 30 జూన్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు 5 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## ఘనంగా సీషెల్స్ 50వ స్వాతంత్ర్యదినోత్సవం

### ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాని మోడీ

**విక్టోరియా,, జూన్ 29 (జర్నలిస్ట్ వార్త):**
భారత్-సీషెల్స్ మధ్య ఉన్న చిరకాల స్నేహబంధానికి అద్దం పట్టేలా సీషెల్స్ 50వ స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా జరుగుతోంది. మూడు రోజుల అధికారిక పర్యటనలో
భాగంగా సీషెల్స్‌కు వెళ్లిన ప్రధాని నరేంద్ర మోదీ.. ఆ దేశ జాతీయ దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.**మిగతా 2లో...**





## అయోధ్య రామాలయ నిధుల దుర్వినియోగం

### అత్యవసర విచారణకు సుప్రీం తిరస్కరణ

### అంత తొందరెందుకని పిటిషన్‌కు ధర్మాసనం ప్రశ్న

**న్యూఢిల్లీ,, జూన్ 29 (జర్నలిస్ట్ వార్త):**
అయోధ్య రామాలయంలో విరాళాల దుర్వినియోగం వ్యవహారం సుప్రీం కోర్టుకు చేరింది. ఈ ఆరోపణలపై నిష్పాక్షిక విచారణ జరిపించాలని కోరుతూ అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. సీబీఐ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని పిటిషనర్ కోరారు. కోర్టు పర్యవేక్షణలో, నిర్ణీత కాలవ్యవధిలో దర్యాప్తు జరిగేలా **మిగతా 2లో...**



## రైతు ఆశీర్వాద సభ వాయిదా



**రైతు భరోసా పంపిణీ తరువాత రైతు ఆశీర్వాద సభ**

**వరుణుడు కూడా కరుణించడం ఆనందదాయకం**

**డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క**

**ఖమ్మం, జూన్ 29 (జర్నలిస్ట్ వార్త):**
ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న రైతు సంక్షేమ, ప్రజా కార్యక్రమాలను మెచ్చి వరణ దేవుడు కూడా కరుణించడాని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. భారీ వర్షాల కారణంగా ఈ నెల 30న తలపెట్టిన రైతు ఆశీర్వాద సభను వాయిదా వేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల సభా ప్రాంగణం అంతా బురదమయంగా మారిందని ఆయన చెప్పుకొచ్చారు. ఈ కారణం వల్ల రైతులకి ప్రజలకి కాంగ్రెస్ కార్యకర్తలకి ఎవరికి ఎలాంటి ఇబ్బందులు రాకూడదన్న ఉద్దేశంతోనే సభ నిర్వహణలో మార్పులు చేసినట్లు ఆయన చెప్పుకుచ్చారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురం గ్రామంలో తలపెట్టిన రైతు ఆశీర్వాద సభ ప్రాంతాన్ని సోమవారం మధ్యాహ్నం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో కలిసి పరిశీలన చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. లక్షలాది మంది రైతుల సమక్షంలో**మిగతా 2లో..**

# తెలంగాణలో త్వరలో కమలం వికసిస్తుంది





**: బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్**

**తెలంగాణలో త్వరలో బీజేపీ ప్రభుత్వం ఖాయమన్న నితిన్ నబిన్**

**బెంగాల్ తరహాలో క్షేత్రస్థాయిలో పనిచేయాలని శ్రేణులకు పిలుపు**

**అవినీతి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని వ్యాఖ్య**

**హైదరాబాద్, జూన్ 29 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణలో త్వరలోనే భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధికారంలోకి వస్తుందని, రాష్ట్రంలో కమలం వికసించడం ఖాయమని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ధీమా వ్యక్తం చేశారు. నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకునేందుకు క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు మరింత పట్టుదలతో శ్రమించాలని ఆయన పిలుపునిచ్చారు.**మిగతా 2లో...**



## వీబీ జీ రామ్ జీ పథకంపై అభ్యంతరాలున్నాయ్

**కేంద్రం సహకరిస్తేనే రాష్ట్రాలు అభివృద్ధి సాధ్యం**

**పాత విధానంలోనే 75 శాతం కాంపోనెంటట్ కొనసాగించాలి**

**60:40 నిధుల విధానంపై తెలంగాణకు తీవ్ర అభ్యంతరాలు**

**గ్రామీణాభివృద్ధిశాఖ సమావేశంలో సీతకక్క స్పష్టీకరణ**



**న్యూఢిల్లీ,జూన్ 29 (జర్నలిస్ట్ వార్త):**
కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి పథకాలకు సంబంధించి తీసుకువస్తున్న సరికొత్త నిధుల విధానాలపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. వీబీ జీ రామ్ జీ పథకంపై అభ్యంతరాలను కేంద్రానికి మంత్రి సీతక్క తెలియజేశారు. సోమవారం ఢిల్లీలో జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సుకు సీతక్క హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామీణాభివృద్ధి పథకాల అమలును జాతీయ సదస్సులో కేంద్రానికి వివరించారు. జులై 2న వీబీ జీ రామ్ జీపై తెలంగాణ కేబినెట్ తుది నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. వీబీ జీ రామ్ జీ పథకం కొనసాగించాలా లేక ఆ స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకం ప్రవేశపెట్టాలా అనే దానిపై ఆలోచన చేస్తామన్నారు. వీబీ జీ రామ్ జీ పథకం 60:40 నిధుల విధానంపై తెలంగాణకు తీవ్ర అభ్యంతరాలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకం పెడితే కేంద్రం నిధులు ఇవ్వదని..100శాతం ఆర్థిక భారం**మిగతా 2లో..**

## తెలంగాణ-కొరియా మధ్య పర్యాటక, సాంస్కృతిక సహకారం


**అక్టోబర్ 25న హైదరాబాద్‌లో తెలంగాణ-కొరియా సాంస్కృతిక మహోత్సవం**

**ఇరు సంస్కృతుల వైభవాన్ని ప్రతిబింబించే ప్రత్యేక వేదికగా హైదరాబాద్**

**భారత్‌లో కే-డ్రామాల ఆదరణతో సాంస్కృతిక అనుబంధం మరింత బలోపేతం**

**కళా-సాంస్కృతిక భాగస్వామ్యానికి ప్రాధాన్యం: మంత్రి జూపల్లి**

**హైదరాబాద్, జూన్ 29 (జర్నలిస్ట్ వార్త):**
ఈ ఏడాది అక్టోబర్ 25న హైదరాబాద్‌లో తెలంగాణ-కొరియా సాంస్కృతిక మహోత్సవం నిర్వహించాలని తెలంగాణ - కొరియన్ కల్చరల్ సెంటర్ లు సంయుక్తంగా సూత్రప్రాయ అంగీకారానికి వచ్చాయి.**మిగతా 2లో...**



## ప్రతిభ కనబర్చిన విద్యార్థులే బ్రాండ్ అంబాసిడర్లు

**షైనింగ్ స్టార్స్' సత్కార కార్యక్రమంలో మంత్రి లోకేశ్**

**టెన్త్, ఇంటర్ షైనింగ్ స్టార్లకు నగదు పురస్కారాలు అందచేత**





**అమరావతి, జూన్ 29 (జర్నలిస్ట్ వార్త):**
"మీరు కష్టపడి చదవండి.. విద్యాశాఖ మంత్రిగా మీ కలలను సాకారం చేసేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తాను" అని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ విద్యార్థులకు భరోసా ఇచ్చారు. సమాజంలో మార్పు కోసం యువత రాజకీయాల్లోకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లిలోని సీఎస్ఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించిన 'షైనింగ్ స్టార్స్' కార్యక్రమంలో లోకేశ్ పాల్గొన్నారు. గత ఏడాది టెన్త్, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఆయన **మిగతా 2లో...**

## ముఖం చాటేసిన నైరుతి

### దేశవ్యాప్తంగా వర్షాల కోసం ఎదురుచూపు

### ఏరువాక సాగక రైతన్న ఆందోళన

**న్యూఢిల్లీ,జూన్ 29 (జర్నలిస్ట్ వార్త):**
:దేశంలో నైరుతి రుతుపవనాలు జూన్ 4న కేరళ తీరాన్ని తాకినప్పటికీ, దేశంలోని చాలాప్రాంతాలు ఇంకా వర్షాల కోసం వేచి చూస్తున్నాయి. గత 146 ఏండ్ల వాతావరణ చరిత్రలో ఈ జూన్ నెల అత్యంత పొడిగా నమోదైన నెలల్లో ఒకటిగా నిలిచిందని వాతావరణ నిపుణులు పేర్కొన్నారు. **2లో...**



## ఉద్యోగులకు తీపికబురు

**మరో రూ.2 వేల కోట్ల బకాయిలు విడుదల**

**ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో నిధులు విడుదల**

**ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం**



# వీబీ జీ రామ్ జీ పథకంపై అభ్యంతరాలున్నాయ్

**మొదటిపేజీ తరువాయి**

రాష్ట్రంపై పడుతోందని వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు పలు కీలక సమస్యలు, నిధుల విడుదల అంశాలపై వినతిపత్రం సమర్పించారు. 'వికసిత్ గ్రామాలు-2047' అనే గొప్ప ఆశయం నెరవేరాలన్నా, గ్రామీణ ప్రాంతాలు స్వయంసమృద్ధి సాధించాలన్నా రాష్ట్రాలపై కేంద్రం అదనపు ఆర్థిక భారం మోపకూడదని ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన విబిజి రామ్ పథకంలో ప్రవేశపెడుతున్న కొత్త 60:40 నిధుల విధానంపై తెలంగాణ ప్రభుత్వం తన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఈ నూతన ఆర్థిక సమీకరణ వల్ల రాష్ట్రాలపై ఊహించని రీతిలో భారీ ఆర్థిక భారం పడుతుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఈ నిబంధనలపై జూలై 2న జరగబోయే రాష్ట్ర కేబినెట్ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం ఒక తుది నిర్ణయం తీసుకోనుందని వెల్లడించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గతంలో ఉన్నట్లుగానే 100 శాతం వేతనాల విధానాన్ని యథాతథంగా కొనసాగించాలని కేంద్రానికి డిమాండ్ చేశారు. అలాగే మెటీరియల్ కాంపోనెంట్‌కు సంబంధించి కూడా గతంలో ఉన్న 75 శాతం కేంద్ర వాటాను అలాగే ఉంచాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కేంద్ర నిధులు కోల్పోకుండానే, రాష్ట్ర ప్రయోజనాలను పూర్తిస్థాయిలో కాపాడేలా తమ ప్రభుత్వం ముందడుగు వేస్తుందని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన కింద రాష్ట్రంలో చేపట్టే గ్రామీణ రోడ్ల నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు ప్రధాన అడ్డంకిగా మారాయని మంత్రి సీతక్క కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఆదిలాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నల్లమల అటవీ ప్రాంతాల్లో అనేక రోడ్డు పనులు పూర్తిగా నిలిచి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం రోడ్లే కాకుండా, అటవీ అనుమతులు సకాలంలో రాకపోవడం వల్ల ఏజెన్సీ ప్రాంతాల్లోని పేదలకు ఇళ్లు, బోర్‌వెల్లు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు కూడా అర్ధాంతరంగా ఆగిపోయాయని వివరించారు. ఈ క్లియరెన్స్ పక్రియను వేగవంతం చేయడంతో పాటు, రాష్ట్రానికి రావాల్సిన పీఎం ఆవాస్ యోజన గృహాల కేటాయింపులను కేంద్రం వెంటనే విడుదల చేయాలని కోరారు. కేంద్రం నుండి నిధుల విడుదలలో జరుగుతున్న జాప్యం వల్ల పనులు మందగిస్తున్నాయని, రాష్ట్రంలో అధికారుల తరచూ బదిలీల వల్ల కూడా కేంద్రానికి నివేదికలు సమర్పించడంలో కొంత ఆలస్యం జరిగిందని ఆమె అంగీకరించారు. ఇన్ని సవాళ్లు ఉన్నప్పటికీ గ్రామీణాభివృద్ధిలో తెలంగాణ అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తోందని మంత్రి సీతక్క గర్వంగా ప్రకటించారు. జల్ సంచార్ విభాగంలో తెలంగాణ రాష్ట్రానికి ఏకంగా 13 జాతీయ అవార్డులు రావడం తమ ప్రభుత్వ సమర్థవంతమైన పనితీరుకు నిదర్శనమన్నారు.

# ప్రతిభ కనబర్చిన విద్యార్థులే బ్రాండ్ అంబాసిడర్లు

**మొదటిపేజీ తరువాయి**

ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమం ఆద్యంతం స్ఫూర్తిదాయకంగా, ఆసక్తికరంగా సాగింది.

ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన 'డ్రీమ్ వాల్స్', 'గ్రాటిట్యూడ్ వాల్స్'పై విద్యార్థులు రాసిన మాటలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని లోకేశ్ తెలిపారు. విద్యార్థులు అద్భుతమైన సలహాలు ఇచ్చారని, వారిలో కొంతమంది అయినా రాజకీయాల్లోకి వస్తేనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. తాను రాజకీయాల్లో ఉండటం వల్లే దేశంలో ఏ రాష్ట్రంలో లేని విద్యా సంస్కరణలు ఏపీలో తీసుకురాగలుగుతున్నానని అన్నారు.

**త్వరలో ఏఐ ట్యూటర్.. బలోపేతం కానున్న గ్రంథాలయాలు**

వివిధ జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులు తమ ఆకాంక్షలు, సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. కాకినాడకు చెందిన క్రాంతి అనే విద్యార్థి స్కూలు స్థాయి నుంచే కంప్యూటర్ ఆపరేటింగ్ సిస్టమ్‌పై శిక్షణ, మోటివేషన్ క్లాసులు, లైబ్రరీల అవసరాన్ని ప్రస్తావించారు. దీనిపై లోకేశ్ స్పందిస్తూ.. రాష్ట్రంలోని అన్ని గ్రంథాలయాలను ప్రక్షాళన చేస్తున్నామని, పుస్తకాలు చదవడం ద్వారా సృజనాత్మకత పెరుగుతుందని అన్నారు.

మండలం, నియోజకవర్గం, జిల్లా, జోనల్ స్థాయిలో లైబ్రరీలను బలోపేతం చేస్తామని, ఏడాదిలోగా అమరావతిలో ప్రపంచస్థాయి గ్రంథాలయాన్ని నిర్మించబోతున్నామని హామీ ఇచ్చారు. మరో విద్యార్థిని అన్నపూర్ణేశ్వరి ఎన్‌సీసీ, కంప్యూటర్ ల్యాబ్ కావాలని కోరగా, త్వరలోనే రాష్ట్రంలోకి ఏఐ ట్యూటర్‌ను తీసుకువస్తున్నామని, అలాగే ఏపీకి ప్రత్యేకంగా ఎన్‌సీసీ స్టేట్ డైరెక్టరేట్‌ను కేంద్రం మంజూరు చేసిందని శుభవార్త తెలిపారు.

**విద్యార్థుల భావోద్వేగ కథలు.. మంత్రి భరోసా**

కార్యక్రమంలో పలువురు విద్యార్థులు తమ వ్యక్తిగత కష్టాలను, ఉన్నత లక్ష్యాలను పంచుకున్నారు. కదిరికి చెందిన షేక్ చాందిని, ఇంటర్‌లో 1000కి 991 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచానని, తన తండ్రి గుండె జబ్బుతో బాధపడుతున్నారని, ఆయన కోసమే కార్డియాలజిస్ట్ కావాలనుకుంటున్నానని తెలిపింది. నీట్ కోసం కోచింగ్ ఇప్పించాలని కోరగా, అందుకు పూర్తి సహాయం అందిస్తానని లోకేశ్ భరోసా ఇచ్చారు.

టెక్కలికి చెందిన అనన్యశ్రీ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని, భవిష్యత్తులో ఐఏఎస్ అధికారిణిగా విజన్ 2047 సాధనకు కృషి చేస్తానని చెప్పింది.

ఆత్మకూరుకు చెందిన షేక్ అనీషా, పాఠశాల స్థాయి నుంచే పోటీపరీక్షలకు శిక్షణ ఇవ్వాలని కోరగా, రాబోయే ఐదేళ్లలో 10, 11, 12 తరగతుల విద్యార్థులు చదువుతో పాటు కాంపిటీటివ్ పరీక్షలకు సిద్ధమయ్యేలా ప్రణాళిక రచిస్తామని లోకేష్ వెల్లడించారు. ప్రకాశం జిల్లా విద్యార్థి పవన్ సాయి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై శిక్షణ కోరగా.. రాబోయేది ఏఐ విప్లవమని, పాఠశాల స్థాయి నుంచే ఏఐ ల్యాబ్స్, ఫండమెంటల్స్‌పై శిక్షణ ఇస్తామని మంత్రి స్పష్టం చేశారు.

**చదువు మధ్యలో ఆగకూడదు.. అండగా ఉంటా**

అనంతపురం జిల్లా నార్పలకు చెందిన మనీష, తన తండ్రి చదివించలేని పరిస్థితుల్లో ఉన్నారని కన్నీటిపర్యంతమవ్వగా, మంత్రి లోకేష్ చలించిపోయారు. "ధైర్యంగా ఉండు, నీ చదువుకు నేను సాయం చేస్తా" అని హామీ ఇచ్చారు. కుటుంబ పరిస్థితుల కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువు మధ్యలో ఆపకూడదనేదే తన లక్ష్యమని, అలాంటి వారిని గుర్తించి చేయూతనిస్తామని చెప్పారు.

ప్రకాశం జిల్లాకు చెందిన భాగ్యం అనే విద్యార్థిని, చిన్నతనంలోనే పెళ్లయినా ఆరేళ్ల తర్వాత మళ్లీ చదువు ప్రారంభించి ఒకేషనల్ కోర్సులో 990 మార్కులతో టాపర్‌గా నిలిచానని, ఇప్పుడు డిగ్రీ చదవాలని ఉందని చెప్పగా, ఆమెకు కూడా సాయం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

ఓ విద్యార్థిని అడిగిన ప్రశ్నకు సమాధానంగా, తాను ఎప్పుడూ బట్టీ కొట్టలేదని, తన బలం అప్లికేషన్, ఎగ్జిక్యూషన్, క్రిటికల్ థింకింగ్ అని లోకేశ్ తన విద్యార్థి జీవితాన్ని గుర్తుచేసుకున్నారు.

శంఖవరం విద్యార్థిని స్వాతి తన గ్రామంలోని రోడ్డు దశాబ్దాలుగా అధ్వానంగా ఉందని చెప్పగా, మూడు నాలుగు నెలల్లో రోడ్డు వేయిస్తానని మాట ఇచ్చారు. విద్యార్థులకు శారీరక విద్యతో పాటు మానసిక ఆరోగ్య అవగాహన కూడా కల్పించాలని విశాఖ విద్యార్థి శ్రీహర్ష చేసిన సూచనను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమం కేవలం సత్కారాలకే పరిమితం కాకుండా, విద్యార్థుల ఆశలు, ఆకాంక్షలకు, ప్రభుత్వ విధాన రూపకల్పనకు వారధిగా నిలిచింది.

# తెలంగాణలో త్వరలో కమలం వికసిస్తుంది

**మొదటిపేజీ తరువాయి**

ఆదివారం హైదరాబాద్ పర్యటనలో భాగంగా ఆయన శంషాబాద్‌లో రంగారెడ్డి రూరల్ జిల్లా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. దీనితో పాటు మరో తొమ్మిది జిల్లాల కార్యాలయాలను వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో పశ్చిమ బెంగాల్‌లో పార్టీ కనబరిచిన పోరాట పటిమను తెలంగాణలోనూ పునరావృతం చేయాలని సూచించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి, అరాచక పాలన సాగిస్తోందని నితిన్ నబిన్ ఆరోపించారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ఈ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు కార్యకర్తలు వీధుల్లోకి వచ్చి పోరాడాలని పిలుపునిచ్చారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఓడించడంలో బీజేపీ కీలక పాత్ర పోషించగా, ఆ ఫలితాన్ని కాంగ్రెస్ తనకనుకూలంగా మార్చుకుని లబ్ధి పొందిందని ఆయన వ్యాఖ్యానించారు. బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి గల్లీ, మొహల్లాకు పార్టీ సిద్ధాంతాలను, ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తీసుకెళ్లాలని ఆయన దిశానిర్దేశం చేశారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ 'డబుల్ ఇంజిన్' సర్కారు ఉంటేనే తెలంగాణ సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

అంతకుముందు, శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న నితిన్ నబిన్‌కు కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, రాష్ట్ర బీజేపీ నేత ఎన్. రాంచందర్ రావు తదితరులు ఘన స్వాగతం పలికారు. అనంతరం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన





బూత్ అధ్యక్షుల 'విజయ్ సంకల్ప్ సమ్మేళనం'లో ఆయన పాల్గొని ప్రసంగించారు.

**మోడీ నేతృత్వంలో విశ్వగురుగా భారత్**
**బిజెపి బూత్ అధ్యక్షుల భేటీలో నితిన్ నబీన్**

ప్రధాని మోదీ నేతృత్వంలో భారత్ విశ్వగురుగా ఎదుగుతోందని భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. పన్నెండేళ్ల మోదీ పాలనలో 25 కోట్ల మంది పేదరికం నుంచి విముక్తి పొందారని చెప్పారు. హనుమకొండలో భాజపా బూత్ అధ్యక్షుల సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ కల సాకారం కావడంలో భాజపా సహకారం ఉందన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు సుష్మాస్వరాజ్ ఎంతో కృషి చేశారని చెప్పారు. 'ప్రభుత్వ పథకాల్లో అవినీతి జరగకుండా ప్రధాని మోదీ చర్యలు తీసుకున్నారు. జన్‌ధన్ ఖాతాలు ఇచ్చి ప్రభుత్వ సొమ్మును నేరుగా పేదల ఖాతాల్లో జమ చేస్తున్నారు. దేశంలోని 80 కోట్ల పేద కుటుంబాలకు ఆయుష్మాన్ భారత్ వర్తింపజేశారు. దేశ ప్రజలందరికీ ఉచితంగా కొవిడ్ టీకా ఇచ్చిన ఘటన మోదీకి దక్కింది. సెమీ కండక్టర్ పరిశ్రమలకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. ఏఐ టెక్నాలజీలో భారత్‌ను అగ్రగామిగా నిలిపేందుకు ప్రధాని కృషి చేస్తున్నారు. వరంగల్ మున్సిపల్ ఎన్నికల్లో భాజపా ఘన విజయం సాధించాలి. వరంగల్ ఖిల్లాపై కాషాయజెండా ఎగరాలి. విభజన రాజకీయాలు చేస్తున్నవారికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి. వరంగల్ బిడ్డ పీవీ నర్సింహారావుకు దిల్లీలో అవమానం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనకు సరైన గౌరవం కూడా ఇవ్వలేదు. పీవీ స్మారక నిర్మాణానికి సోనియాగాంధీ అంగీకరించలేదు' అని నితిన్ నబీన్ విమర్శించారు.

# అయోధ్య రామాలయ నిధుల దుర్వినియోగం

**మొదటిపేజీ తరువాయి**

ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించారు. అయితే ఈ పిటిషన్ అత్యవసర విచారణకు సుప్రీం నిరాకరించింది. అయోధ్య రామమందిర విరాళాల నిధుల దుర్వినియోగం జరిగిందంటూ దాఖలైన పిటిషన్‌పై తక్షణ విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ వ్యవహారంపై సీబీఐతో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని కోరుతూ పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే ఈ కేసులో వెంటనే విచారణ చేపట్టాల్సిన అత్యవసర పరిస్థితులు లేవని జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ షీల్ నాగు ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే, పిటిషనర్ తరఫు న్యాయవాది వాదిస్తూ, రామమందిర విరాళాల నిధుల వినియోగంలో అవకతవకలు జరిగాయని, ఈ వ్యవహారంపై సీబీఐతో స్వతంత్ర విచారణ జరిపించాలని కోర్టును కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అనుమానాలకు తావిస్తోందని, అందుకే స్వతంత్ర దర్యాప్తు అవసరమని ఆయన వాదించారు. ఇక, కేసు ఆలస్యమైతే ఎలక్ట్రానిక్ ఆధారాలు చెరిపివేసే అవకాశం ఉందని పిటిషనర్ తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కోర్టు, మెన్షన్ స్లిప్ సర్క్యులేట్ చేయాలని సూచించింది. అయితే

ఈ కేసులో వెంటనే విచారణ చేపట్టాల్సిన అత్యవసర పరిస్థితులు లేవని జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ షీల్ నాగు ధర్మాసనం స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తిరిగి ప్రారంభమైన వెంటనే ఈ కేసును లిస్ట్ చేసి విచారణ చేపడతామని జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్ నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. ప్రస్తుతం ఈ అంశంపై అత్యవసర విచారణ అవసరం లేదని స్పష్టం చేసింది. ఈలోపే మిన్ను విరిగి మీద పడదు.. అంత తొందరెందుక'ని పిటిషనర్‌ను ప్రశ్నించింది. మరోవైపు, ఈ కేసులో నిందితుల పక్షాన ఎవరూ వాదించొద్దని ÷జాబాద్ బార్ అసోసియేషన్ నిర్ణయించింది. 'ఈ కేసులో నిందితుల తరఫున ఎవరూ వాదించరు. ఒకవేళ ఎవరైనా అలా చేస్తే.. క్రమశిక్షణా చర్యలు ఎదుర్కోవలసి వస్తుంది. వారికి రూ.5లక్షలు జరిమానా విధిస్తాం' అని అసోసియేషన్ అధ్యక్షుడు కలికా ప్రసాద్ మిశ్రా మీడియాకు వెల్లడించారు. 2005లో కూడా అక్కడి న్యాయవాదులు ఇలాంటి నిర్ణయమే తీసుకున్నారు. ఆ ఏడాది రామ మందిరంపై దాడికి పాల్పడిన నిందితులను ఫైజజాబాద్ కోర్టు ముందు హాజరుపర్చగా.. వారి పక్షాన వాదించేందుకు ఎవరూ ముందుకురాలేదు.

# తెలంగాణ-కొరియా మధ్య పర్యాటక, సాంస్కృతిక సహకారం

**మొదటిపేజీ తరువాయి**

తెలంగాణ-కొరియా మధ్య పర్యాటక, సాంస్కృతిక రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించేందుకు ఇరు పక్షాలు చర్చించాయి. భారత్‌లోని కొరియన్ కల్చరల్ సెంటర్ డైరెక్టర్, భారతదేశంలోని కొరియా రాయబార కార్యాలయం కల్చర్ అండ్ ప్రెస్ కౌన్సిలర్ హ్వాంగ్ ఇల్యాంగ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం సోమవారం పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును డా.బీఆర్. అంబేద్కర్ సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ గొప్ప చారిత్రక వారసత్వం, వైవిధ్యభరితమైన సంస్కృతి, సంప్రదాయ కళారూపాలు, ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రాలతో ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. ప్రతిపాదిత తెలంగాణ-కొరియా సాంస్కృతిక మహోత్సవం ద్వారా ఇరు ప్రాంతాల కళలు, సంగీతం, నృత్యం, వంటకాలు, సంప్రదాయాలను ఒకే వేదికపై ఆవిష్కరించే అవకాశం లభిస్తుందని, పర్యాటకాభివృద్ధితో పాటు ప్రజల మధ్య సత్సంబంధాలు మరింత పెరుగుతాయని తెలిపారు.. సమావేశంలో కిమ్ కాంగ్‌హున్ (హెడ్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్, ఐఅఅఎ), ఇమ్ హ్విజే (హెడ్ ఆఫ్ పబ్లిక్ రిలేషన్స్, ఐఅఅఎ), తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు కొరియా కాన్సుల్ జనరల్ సురేష్ చుక్కపల్లి పాల్గొన్నారు.

# ఘనంగా సీషెల్స్ 50వ స్వాతంత్ర్యదినోత్సవం

**మొదటిపేజీ తరువాయి**

ఈ సందర్భంగా సోమవారం భారత ఆర్మీ, నౌకాదళ దళాలు కవాతు నిర్వహించగా.. వారికి గౌరవ సూచకంగా ప్రధాని మోదీ లేచి నిలబడటం కార్యక్రమానికి విశేషంగా నిలిచింది. రాజధాని విక్టోరియాలో నిర్వహించిన గో÷-డలెన్ జూబ్లీ పరేడ్‌లో భారత ఆర్మీకి చెందిన అస్సాం రెజిమెంట్ సైనికులు, భారత నౌకాదళానికి చెందిన సిబ్బంది కవాతు నిర్వహించి ఆకట్టుకున్నారు. ముఖ్యంగా అస్సాం రెజిమెంట్ జవాన్లు తమ ప్రసిద్ధ రెజిమెంటల్ గీతం 'బద్లు రామ్ కా బదన్' ఆలపిస్తూ మార్చ్ చేయడం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ వేడుకల్లో భారత నౌకాదళానికి చెందిన అత్యాధునిక స్టెల్త్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ తార్కష్, స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన ఐఎన్ఎస్ ఇక్షాక్ సర్వే నౌకలూ పాల్గొన్నాయి. దీంతో ఇరు దేశాల మధ్య రక్షణ సహకారం మరింత బలపడుతున్న సంకేతాలు స్పష్టం అయ్యాయి. ఈ సందర్భంగా భారత నౌకాదళం స్పందించింది. సీషెల్స్ జాతీయ దినోత్సవ స్వర్ణోత్సవాల్లో ఐఎన్ఎస్ తార్కష్, ఐఎన్ఎస్ ఇక్షాక్ నౌకలు, భారత నౌకాదళ బ్యాండ్, మార్చింగ్ కంటింజెంట్ పాల్గొన్నాయని తెలిపింది. ఇది భారత్-సీషెల్స్ సముద్ర సహకారానికి ప్రతీకని పేర్కొంది. మరోవైపు, ఈ వేడుకల అనంతరం ప్రధాని మోదీ కూడా ఎక్స్‌లో స్పందించారు. ఈ సందర్భంగా సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీ ఆతిథ్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'అస్సాం రెజిమెంట్, భారత నౌకాదళ దళాలు సీషెల్స్ జాతీయ దినోత్సవ పరేడ్‌లో పాల్గొనడం ఇరు దేశాల మధ్య ఉన్న చిరస్థాయి స్నేహానికి మరో నిదర్శనం' అని ప్రధాని పేర్కొన్నారు. కాగా, ప్రధాని మోదీకి సీషెల్స్ అత్యున్నత పురస్కారం 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హారిజన్' లభించింది. దీనిని ఆ దేశ ప్రధాని ప్యాట్రిక్ హెర్మినీ.. భారత ప్రధానికి అందజేశారు.

# ముఖం చాటేసిన నైరుతి

**మొదటిపేజీ తరువాయి**

మొత్తంగా దేశంలో నైరుతి రుతుపవనాలు మళ్లీ ముఖం చాటేశాయి. జూన్ 4 నుంచి 28 మధ్య సాధారణంగా 141.4 ఎంఎం వర్షం కురువాల్సి ఉండగా, ఈసారి 77.1 ఎంఎం వర్షపాతమే నమోదైంది. కదిలే మేఘాలు ఈశాన్య రాష్ట్రాలు, బంగ్లాదేశ్ సరిహద్దు ప్రాంతాలు, దక్షిణ-మధ్య అరేబియా సముద్రానికే పరిమితమయ్యాయి. భారత వాతావరణ శాఖ విడుదల చేసిన వర్షపాతం పటం రుతుపవనాల అస్థిర ప్రభావాన్ని తెలియజేస్తున్నది. గుజరాత్ 86 శాతం వర్షపాతలోటుతో ఉండగా, మహారాష్ట్రలో 60 శాతం లోటు నమోదైంది. మధ్యప్రదేశ్ లో 42 శాతం, యూపీలో 59 శాతం, బీహార్‌లో 52 శాతం, ఒడిశాలో 53 శాతం, తెలంగాణలో 32 శాతం, కర్ణాటకలో 47 శాతం వర్షపాత లోటు రికార్డయ్యింది. తెలంగాణ రాష్ట్రంలో వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ.. ఎల్ నినో ప్రభావం వల్ల చాలాప్రాంతాల్లో చినుకుజాడ కరువైంది. వానకాలం సాగుపై రైతుల్లో ఆందోళన పెరుగుతున్నది. జూన్ 15 నాటికి దేశంలోని దక్షిణ, తూర్పు, ఈశాన్య ప్రాంతాలకు విస్తరించిన రుతుపవనాలు, తర్వాత స్తంభించిపోయాయి. దేశంలోని చాలాప్రాంతాల్లో 40 శాతం తకువ వర్షపాతం నమోదయ్యింది. జూన్ నెల లోటును భర్తీ చేయడానికి కొంతసమయం పడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. వాతావరణంలో తేమ శాతం పెరుగడం వల్ల, సుదీర్ఘ పొడికాలం తర్వాత అకస్మాత్తుగా కురిసే భారీవర్షాలు, వరదలు వంటి తీవ్ర వాతావరణ పరిస్థితులు భవిష్యత్తులో పెరిగే అవకాశం ఉన్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తెలంగాణకు హైదరాబాద్ వాతావరణశాఖ రెయిన్ అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, మెదక్, రాజన్న సిరిసిల్ల, నల్లగొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురిసేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని వెల్లడించారు. గడిచిన 24 గంటల్లో మహబూబాబాద్ జిల్లా మరిపెడలో 8.35 సెం.మీ, కరీంనగర్ జిల్లా రామడుగులో 6.94 సెం.మీ, కరీంనగర్ రూరల్‌లో 6.15 సెం.మీ, జగిత్యాల జిల్లా వెల్గటూర్‌లో 5.20 సెం.మీ, మెట్‌పల్లిలో 4.31 సెం.మీ, కామారెడ్డి జిల్లా భిక్కనూర్‌లో 5.20 సెం.మీ, సూర్యాపేట జిల్లా మద్దిరాళ్లలో 4.09 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదయినట్టు అధికారులు తెలిపారు.

# ఉద్యోగులకు తీపికబురు

**మరో రూ.2 వేల కోట్ల బకాయిలు విడుదల**

**హైదరాబాద్‌జూన్ 29 (జర్నలిస్ట్ వార్త):**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పట్ల ఉన్న చిత్తశుద్ధిని రాష్ట్ర ప్రభుత్వం మరోసారి చాటుకుంది. ఉద్యోగులకు తీపికబురు అందించింది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఉద్యోగులకు ఇచ్చిన హామీని నెరవేర్చింది. బకాయిల చెల్లింపు ప్రక్రియను వేగవంతం చేసింది. ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా అడుగులు వేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కల ఆదేశాల మేరకు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా సోమవారం రూ.రెండు వేల కోట్ల నిధులను విడుదల చేశారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ఉద్యోగులు, రిటైర్డ్ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగ జేఏసీ నాయకులకు ఇచ్చిన హామీ మేరకు, సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను 100 రోజుల్లో రూ. ఆరు వేల కోట్లు విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గత నెల 29న మొదటి విడతగా రూ.రెండు వేల కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. రెండో విడతలో మరో రూ.రెండు వేల కోట్ల నిధులను విడుదల చేసి తన నిబద్ధతను నిరూపించుకుంది. ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్నది. అందులో భాగంగా రిటైర్డ్ ఉద్యోగులు, జిల్లా పరిషత్ ఉపాధ్యాయులకు సంబంధించిన జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) బకాయిలను వంద శాతం చెల్లించి, వారి ఖాతాలను పూర్తిగా క్లియర్ చేసినట్టు ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుతం రిటైర్డ్ ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాల్లో ఎలాంటి పెండింగ్‌లు లేవని స్పష్టం చేసింది. రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి గతేడాది సెప్టెంబర్ వరకు ఉన్న కమ్యూటేషన్ బకాయిలన్నింటినీ ప్రభుత్వం పూర్తిగా చెల్లించిందని పేర్కొంది. పెండింగ్‌లో ఉన్న రూ.పది వేలలోపు విలువ కలిగిన చిన్న మొత్తాల బిల్లులన్నింటినీ ప్రభుత్వం పరిష్కరించిందని తెలిపింది. ఈ విభాగంలో దాదాపు ఐదు లక్షలకుపైగా ఉన్న టోకెన్లను గుర్తించి, ఏమాత్రం జాప్యం లేకుండా చెల్లింపులు జరిపినట్టు పేర్కొంది. ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగ సంఘాల నేతలు సంతోషం వ్యక్తం చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వం చూపుతున్న సానుకూల ధోరణి అభినందనీయమని తెలిపారు. రాబోయే రోజుల్లో మిగిలిన బకాయిలను కూడా క్రమపద్ధతిలో మంజూరు చేస్తామని ఆర్థిక శాఖ అధికారులు వెల్లడించడంతో, ఉద్యోగుల్లో నూతన ఉత్సాహం కనిపిస్తున్నది.

# రైతు ఆశీర్వాద సభ వాయిదా

**మొదటిపేజీ తరువాయి**

ముఖ్యమంత్రి, కేబినెట్ మంత్రులందరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించాలని భావించినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల్లో ఇక్కడ సభ నిర్వహించడం అందరికీ ఇబ్బందికరంగా ఉంటుందని అన్నారు. తొలిరోజు ప్రారంభ సభగా అనుకున్న ఈ కార్యక్రమాన్ని, ఇప్పుడు రైతు భరోసా పంపిణీ పూర్తి అయిన తర్వాత మరింత ఉత్సాహంగా 'రైతు ఆశీర్వాద సభ' పేరుతో ముగింపు వేడుకగా నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. వర్షాలు తగ్గిన తరువాత వాతావరణ శాఖ నివేదికలను అనుసరించి ముఖ్యమంత్రి, కేబినెట్ ఈ నిర్ణయం తీసుకుంటుందని ఆయన చెప్పారు. సభ నిర్వహణ తేదీలపై ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ... జిల్లా అధికార యంత్రాంగం ఇప్పటికే వాతావరణ శాఖ నుంచి వారం రోజుల ముందస్తు అంచనాలను తీసుకుంటుందని ఆయన అన్నారు. జులై నెల 3, 4 తేదీల వరకు వర్షాలు ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసేందుకు మరో వారం రోజుల వాతావరణ సమాచారాన్ని సేకరించాలని ఆదేశించాం. వాతావరణ పరిస్థితిని బట్టి ఈ సభను వచ్చే 6, 7 లేదా 8వ తేదీల్లో నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఈ భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు స్థానిక మంత్రులు, ప్రజాప్రతినిధులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారని డిప్యూటీ సీఎం తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, సత్తెపల్లి ఎమ్మెల్యే డాక్టర్ రాగమయిలతో పాటు జిల్లాలోని శాసనసభ్యులంతా సమన్వయంతో ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**పథకాల కోసం ఒక్క రూపాయి ఇవ్వొద్దు: ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

**ధర్మసాగర్‌లో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**







**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరోజూన్ 29 (జర్నలిస్ట్ వార్త):** పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావులేకుండా చేరేలా చర్యలు తీసుకుంటున్నామని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం ఎవరూ మధ్యవర్తులకు గానీ, అధికారులకు గానీ ఒక్క రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

ధర్మసాగర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 26 మంది కల్యాణలక్ష్మిషాదీ ముబారక్ లబ్ధిదారులకు రూ.26,03,016 విలువైన చెక్కులు, 39 మంది సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు రూ.14.25 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ధర్మసాగర్‌కు చెందిన భూక్య వసంతకు రూ.2.50 లక్షల ఎల్‌వోసీ మంజూరు పత్రాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. ముప్పారం గ్రామంలో రెండు అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి మంజూరు పత్రాలను స్థానిక సర్పంచ్‌కు అందజేశారు.

**ఆడబిడ్డ పెళ్లికి భరోసా**

కల్యాణలక్ష్మి పథకం పేదింటి ఆడపిల్లల తల్లిదండ్రులకు గొప్ప అండగా నిలుస్తోందని కడియం శ్రీహరి అన్నారు. పెళ్లి ఖర్చులతో ఇబ్బందులు పడే కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న రూ.1,01,116 ఆర్థిక సహాయం ఊరటనిస్తోందన్నారు. పెళ్లి జరిగిన వెంటనే దరఖాస్తు చేసుకుంటే మూడు నెలల్లోపు ప్రక్రియ పూర్తి అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**సంక్షేమ పథకాలకే ప్రాధాన్యం**

రాష్ట్రంపై ఆర్థిక భారం ఉన్నప్పటికీ పేదల సంక్షేమంలో ప్రభుత్వం వెనుకడుగు వేయడం లేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ ద్వారా సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి పథకాలను సమర్థంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. రైతులు, మహిళలు, నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు.

**అవినీతికి తావుండదు**

ఇందిరమ్మ ఇళ్లు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ సహా ఏ ప్రభుత్వ పథకం కోసం కూడా లబ్ధిదారులు ఎవరికి ఒక్క రూపాయి ఇవ్వొద్దని కడియం శ్రీహరి స్పష్టం చేశారు. అర్హులకే పథకాలు అందేలా అధికారులు నిజాయితీగా పనిచేయాలని, అవినీతికి పాల్పడే అధికారులను సహించబోనని హెచ్చరించారు.

**అభివృద్ధిలో ముందంజ**

ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే అత్యధిక నిధులతో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలతో పాటు సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్, బవుసింగ్ సింగ్ ఎంపీడీవో అనిల్ కుమార్ వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.


## నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు 79.07 శాతం ఉత్తీర్ణత



**నర్సంపేట /జూన్ 29 (జర్నలిస్ట్ వార్త):** నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో ఏప్రిల్‌మే 2026లో నిర్వహించిన బీఏ, బీకాం, బీఎస్సీ రెండో, నాలుగో, ఆరో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామ్‌చంద్రం, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ కట్ల సోమవారం విడుదల చేశారు.కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ తెలిపిన వివరాల ప్రకారం బీఏలో వంద శాతం, బీఎస్సీ (లైఫ్ సైన్సెస్)లో 87.04 శాతం, బీఎస్సీ (ఫిజికల్ సైన్సెస్)లో 63.64 శాతం, బీకాంలో 57.89 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మొత్తం మీద కళాశాల 79.07 శాతం ఉత్తీర్ణత సాధించింది.అటానమస్ పరీక్షలను విజయవంతంగా నిర్వహించిన ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్, పరీక్షల నియంత్రణాధికారి ఎస్. కమలాకర్‌ను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామ్‌చంద్రం అభినందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ, కళాశాల విద్యాశాఖ, కాకతీయ విశ్వవిద్యాలయ అధికారులు అందించిన సహకారానికి ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు.ఫలితాల విడుదల కార్యక్రమంలో ఓఎస్డీవీసీ ప్రొఫెసర్ వెంకట్రామ్ రెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ జె. రాజీరు, స్టాఫ్ సెక్రటరీ ఎంఎంకె రహీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు జరిగే రైతు ఆశీర్వాద సభను జయప్రదం చేయండి.

**-జిల్లా కిసాన్ సెల్ ప్రధానకార్యదర్శి పెద్దినేని వెంకటేశ్వరరావు.**



**బయ్యారం/,జూన్ 29.(జర్నలిస్ట్ వార్త):**ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం చింతకాని మండలం జగన్నాధపురంలో నేడు జరగబోయే రైతు ఆశీర్వాద సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్న ఈ కార్యక్రమానికి రైతులు భారీగా తరలివచ్చి జయప్రదం చెయ్యాలని మహబూబాబాద్ జిల్లా కిసాన్ సెల్ ప్రధానకార్యదర్శి పెద్దినేని వెంకటేశ్వరరావు రైతులను కోరారు.ఇంతటి చారిత్రాత్మక సభకు లక్షలాది మంది రైతులు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.రాష్ట్ర ప్రగతి,ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వానికి అండగా నిలిచి మహబూబాబాద్ జిల్లాలోని అన్ని మండలాల నుండి రైతులు పెద్దఎత్తున తరలి రావాలని పెద్దినేని వెంకటేశ్వరరావు రైతులకు పిలుపునిచ్చారు.

# గుడిసెలు లేని నియోజకవర్గమే లక్ష్యం

**ఎల్కుర్తి, జానకిపురంలో అభివృద్ధి పనులకు శ్రీకారం**

**రూ.2.50 కోట్లకు పైగా పనుల ప్రారంభం.. శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి**





**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరోజూన్ 29 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణలోనే గుడిసెలు లేని నియోజకవర్గంగా స్టేషన్‌ఘన్‌పూర్‌ను తీర్చిదిద్దడమే తన లక్ష్యమని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. అర్హులైన నిరుపేదలకు రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు. ధర్మసాగర్ మండలంలోని ఎల్కుర్తి, జానకిపురం గ్రామాల్లో సోమవారం పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల్లో పాల్గొన్న ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.

ఎల్కుర్తి గ్రామంలో రూ.13 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే, రూ.1.92 కోట్లతో నిర్మించనున్న ఆర్‌అండ్‌బీ సీసీ రోడ్డు, ఇరువైపులా కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం జానకిపురంలో రూ.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించి, రూ.15 లక్షలతో నిర్మించనున్న సైడ్ డ్రైనేజీలకు శంకుస్థాపన చేశారు. అలాగే నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులతో కలిసి ప్రారంభించారు.

**60 రోజుల్లో రోడ్డు పూర్తి**

ఎల్కుర్తి గ్రామంలో చేపట్టిన రూ.1.92 కోట్ల సీసీ రోడ్డు నిర్మాణాన్ని 60 రోజుల్లో పూర్తి చేస్తామని కడియం శ్రీహరి తెలిపారు. పనుల వేగవంతమైన అమలుకు గ్రామస్థులు సహకరించాలని కోరారు. అసంపూర్తిగా ఉన్న



గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి వెంటనే నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఏడాదిలోగా గ్రామానికి నాలుగు వైపులా ఉన్న బీటీ రోడ్లన్నింటినీ డబుల్ రోడ్లుగా అభివృద్ధి చేసి గ్రామ రూపురేఖలు మారుస్తామని చెప్పారు.

**మరో డబుల్ రోడ్లకు హామీ**

జాతీయ రహదారి నుంచి ఎల్కుర్తి మీదుగా నారాయణగిరి వరకు రూ.18 కోట్లతో డబుల్ రోడ్డు మంజూరైందని తెలిపారు. కరుణాపురంసోమదేవరపల్లిఎల్కుర్తి మార్గంలో రూ.50 కోట్లతో మరో డబుల్ రోడ్డు కూడా త్వరలో మంజూరుకానుందని వెల్లడించారు.

**జానకిపురానికి ప్రత్యేక దృష్టి**

జానకిపురం గ్రామ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని ఎమ్మెల్యే చెప్పారు. నారాయణగిరిజానకిపురంరాయగూడెం బీటీ రోడ్డు, గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి త్వరలోనే మంజూరు తీసుకొస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటికే రూ.45 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించామని, త్వరలో మరో రూ.25 లక్షలతో సీసీ రోడ్లు, అంగన్‌వాడీ భవనం మంజూరు చేస్తామని ప్రకటించారు.

**మాజీ ఎమ్మెల్యేపై విమర్శలు**

గత 20 ఏళ్లలో నియోజకవర్గ అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని కడియం శ్రీహరి విమర్శించారు. అప్పట్లో ప్రజల కోసం పనులు చేయకుండా పదవులు, పథకాలను అమ్ముకున్నారని ఆరోపించారు. గ్రామాలకు ఒక్క పని చేయని వారు ఇప్పుడు విమర్శలు చేయడం విడ్డూరమన్నారు. ప్రజలు గతంలో జరిగిన పనులను, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధిని పోల్చి చూడాలని కోరారు.

**అభివృద్ధే నా బాధ్యత**

నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఒక్కో సమస్యను దశలవారీగా పరిష్కరిస్తూ, ప్రతి గ్రామంలో రోడ్లు, మౌలిక సదుపాయాలు, గృహ నిర్మాణ పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో ఎల్కుర్తి సర్పంచ్ నరిశెట్టి సుధాకర్, జానకపురం జగన్‌మోహన్‌రెడ్డి, తహసీల్దార్, బాపు సింగ్ ఎంపీడీవో, అనిల్ కుమార్ వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అర్హులైన ఓటరు జాబితాను సిద్ధం చేయడమే సర్ ముఖ్య ఉద్దేశ్యం.

**-సర్పంచ్ బొల్లి జయంతి వెంకటకృష్ణ.**



**బయ్యారం/,జూన్ 29.(జర్నలిస్ట్ వార్త)**

బయ్యారం మండలం జగ్గుతండ గ్రామంలో జరుగుతున్న సర్ కార్యక్రమాన్ని జగ్గుతండ సర్పంచ్ బొల్లి జయంతి వెంకటకృష్ణ సోమవారం పరిశీలించారు.సర్ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించి తదుపరి బూత్ లెవెల్ అధికారులకు సూచనలు చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం నకిలీ ఓట్లను తీసేసి అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడమే ముఖ్య లక్ష్యం అన్నారు.ఈ సందర్భంగా ప్రజలందరూ కూడా ఓటు సవరణ ఫారాలను జాగ్రత్తగా పూర్తిచేసి బూత్ లెవెల్ అధికారులకు ఇవ్వాలని అన్నారు.సర్ పై ఎవరికైనా సందేహం ఉంటే స్థానిక బూతు లెవల్ అధికారులను సంప్రదించి వారి సహకారంతో ఫారంని పూర్తి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఓటర్లు, గ్రామ ప్రజలు,బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

## బౌద్ధనగర్ డివిజన్లో చురుకుగా ఎస్ఐఆర్ కార్యక్రమం



**సికింద్రాబాద్/ జూన్ 29(జర్నలిస్ట్ వార్త);**మాజీ డిప్యూటీ స్పీకర్ సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ళ పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు సోమవారం బౌద్ధనగర్ డివిజన్ పలు చోట్ల బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రాజేష్ ఆధ్వర్యంలో ఇంటి ఇంటికి తిరుగుతూ ఎస్ఐఆర్ కార్యక్రమం పై అవగాహన కల్పిస్తూ ప్రజలకు పాత్రలను అందచేశారు. ఈ సందర్భంగా ఆయనా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బకిర్, ఇమ్రాన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# క్యాతంపల్లిలో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక

**గో టు విలేజ్ తో గ్రామస్థాయిలో ఉద్యమం బలోపేతం లక్ష్యం**



**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరోజూన్ 29 (జర్నలిస్ట్ వార్త):** గ్రామ స్థాయిలో సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేయడమే లక్ష్యంగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన గో టు విలేజ్ కార్యక్రమానికి క్యాతంపల్లి గ్రామం వేదికైంది. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు సోమవారం నిర్వహించిన సమావేశంలో నూతన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి గంగారపు శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో గ్రామ గౌరవ అధ్యక్షులుగా కుర్సపెల్లి కొమురయ్య మాదిగ, గంగారపు కరుణాకర్ మాదిగ, గంగారపు వెంకటస్వామి మాదిగలను ఎంపిక చేశారు. గ్రామ అధ్యక్షుడిగా శిక ప్రభాస్ మాదిగ, అధికార ప్రతినిధిగా కుర్సపెల్లి విజయకుమార్ మాదిగ బాధ్యతలు చేపట్టారు.ఉపాధ్యక్షులుగా కుర్సపెల్లి తియోపిలాస్ మాదిగ, కొలిపాక రాజు మాదిగ, ప్రధాన కార్యదర్శిగా గంగారపు ప్రభుదాస్ మాదిగ, ప్రచార కార్యదర్శిగా గంగారపు అశ్విత్ మాదిగ, కార్యదర్శిగా గంగారపు దీపక్ మాదిగ, సహాయ కార్యదర్శిగా కుర్సపెల్లి ప్రమోద్ మాదిగలను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా గంగారపు ఎల్లాస్వామి మాదిగ, కుర్సపెల్లి రాజు మాదిగ, కుర్సపెల్లి ప్రశాంత్ మాదిగ, గంగారపు శీను మాదిగ, కుర్సపెల్లి జీవన్ మాదిగ, గంగారపు శంకర్ మాదిగతో పాటు పలువురిని ఎంపిక చేశారు.ఈ సందర్భంగా గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని మరింత విస్తరించి, సామాజిక న్యాయం సాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. నూతన కమిటీ గ్రామ ప్రజల సమస్యల పరిష్కారంతో పాటు సంస్థ బలోపేతానికి సమిష్టిగా పనిచేస్తుందని తెలిపారు.

# ఏఐ మాయాజాలం...

## మందగిస్తున్న మానవ మేధస్సు

నేడు మానవ జీవితాన్ని శాసిస్తోంది. ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకోబోయే వరకు ప్రతి చిన్న పనికీ ఐటీ, ఏఐ సాధనాలపై ఆధారపడటం ఒక అలవాటుగా, వ్యసనంగా మారిపోతోంది, ఒకప్పుడు మనిషి తన మస్తిష్కానికి పదును పెట్టి చేసిన పనులన్నింటినీ ఇప్పుడు ఏఐ చేతిలో పెట్టేస్తున్నాడు. ఈ అతి ఆధారపడటం అనేది కాలక్రమేణా మానవాళిని తన స్వశక్తి జ్ఞానాన్ని కోల్పోయేలా చేస్తోందా? అంటే అవుననే సమాధానం మేధావుల నుంచి బలంగా వినిపిస్తోంది. ఒకప్పుడు ఏదైనా ఒక విషయం గురించి తెలుసుకోవాలంటే పుస్తకాలు తిరగేసేవాళ్లం, నలుగురితో చర్చించేవాళ్లం, మెదడుకు పని చెప్పేవాళ్లం. కానీ నేడు గూగుల్ సెర్చ్ దాటి, చాట్ జీపీటీ వంటి ఏఐ టూల్స్ రంగప్రవేశం చేశాక. ఆలోచించే శ్రమను మనిషి పూర్తిగా వదిలేశాడు. వ్యాసాలు రాయాలన్నా, లెక్కలు కట్టాలన్నా, ఒక సమస్యకు పరిష్కారం కనుగొనాలన్నా, చివరికి ఒకరికి శుభాకాంక్షలు చెప్పాలన్నా ఏఐ ని అడుగుతున్నాడు. దీనివల్ల మనిషి సహజసిద్ధమైన సృజనాత్మకత విమర్శనాత్మక ఆలోచనా ధోరణి మందగిస్తున్నాయి. వాడకపోతే



తుప్పుపట్టే ఇనుములాగే, మెదడుకు పని చెప్పకపోతే అది కూడా మొద్దుబారిపోతుందనే పచ్చి నిజాన్ని మనం మరుస్తున్నాం.

విద్యారంగంలో ఈ ప్రభావం మరింత ప్రమాదకరంగా మారుతోంది. విద్యార్థులు హోంవర్క్‌లు, ప్రాజెక్టుల కోసం సొంతంగా ఆలోచించడం మానేసి, ఏఐ ఇచ్చే సమాధానాలను కాపీ–పేస్ట్ చేస్తున్నారు. దీనివల్ల పరీక్షల్లో మార్కులు రావచ్చు కానీ, సదరు సబ్జెక్టుపై కనీస అవగాహన, జ్ఞానం శూన్యమవుతున్నాయి. డిజిటల్ తెరలపై చూపే రెడీమేడ్ సమాచారమే పరమావధిగా భావిస్తే రేపటి తరం కేవలం ఒక రోబో'లా మారుతుందే తప్ప, సరికొత్త ఆవిష్కరణలు చేసే మేధావులను సమాజం కోల్పోతుంది.

సాంకేతికత ఎప్పుడైనా మనిషికి సహాయకారి గా ఉండాలి తప్ప, మనిషిని నిస్సహాయుడి గా మార్చకూడదు. ఏఐ ఇచ్చే సమాచారం వెనుక ఎంతవరకు నిజముంది? అందులో పక్షపాతాలు ఏమైనా ఉన్నాయా? అని ప్రశ్నించే విచక్షణా జ్ఞానాన్ని కూడా కోల్పోయి, దాన్ని గుడ్డిగా నమ్మే ప్రమాదంలో పడ్డాం. మన ఆలోచనలను, మన నిర్ణయాలను ఒక అల్గారిథమ్‌కు అప్పగించేస్తే రేపు మనిషి ఉనికికి, అస్తిత్వానికి అర్థమేముంటుంది?

ఏఐ అనేది ఒక అద్భుతమైన సాధనం. దాన్ని విజ్ఞానాన్ని పెంచుకోవడానికి ఒక వనరుగా వాడుకోవాలే తప్ప, మన మేధస్సుకు ప్రత్యామ్నాయంగా మార్చుకోకూడదు. ఆధారపడటం పరిధి దాటితే అది బానిసత్వానికి దారితీస్తుంది. సాంకేతికతను అందిపుచ్చుకుంటూనే, మన స్వయం ఆలోచనను, సృజనాత్మకతను కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి తరంపై ఉంది. మేధస్సుకు కృత్రిమ రంగులు అద్దకుండా, స్వశక్తి జ్ఞానాన్ని నిలబెట్టుకున్నప్పుడే మానవ ప్రగతికి నిజమైన సార్థకత లభిస్తుంది.



సీనియర్ జర్నలిస్ట్ బిర్రు కరుణాకర్
సెల్ నంబర్ 9701249103

# ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే.







**బయ్యారం/,జూన్ 29.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలం నామలపాడు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులు నీటి కష్టాలతో ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సోమవారం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించి నీటి ఇబ్బందులపై ఆరా తీశారు.ఎమ్మెల్యే పాఠశాలలోని తరగతి గదులను, టాయిలెట్లను పరిశీలించారు. టాయిలెట్స్ లో నీరు రాకపోవడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.తరగతి గదిలో విద్యార్థులతో బోధన తెలుగు పాఠ్య పుస్తకంలోని తెలుగు తల్లి విగ్రహాన్ని చూపించి ఏమిటని అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ జాతీయ గీతం తెలుసా అని ప్రశ్నించారు.తరగతి గదిలో తనిఖీ చేసి నీటి కొరత ఉన్నదా అని విద్యార్థులను అడిగారు.నీటి కొరత ఉన్నదని విద్యార్థులు తెలపడంతో అక్కడే ఉన్న అధికారులను నీటి కొరత లేకుండా చూసుకోవాలని ఆదేశించారు.అనారోగ్యంతో ఉన్న పిల్లలను పలకరించి వైద్య సేవలను అడిగి ఆరా తీశారు.సిబ్బంది పిల్లలకి పల్స్ పోలియో చుక్కలను ఎమ్మెల్యే అందించారు.ప్రిన్సిపాల్ ధనరాజ్ తో మాట్లాడుతూ నీటి వసతులు ఎక్కడెక్కడ ఉన్నాయో గమనించి తక్షణమే శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు..నీటి కొరత ఉన్నట్లు మళ్ళీ నా దృష్టికి వస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.ప్రజాప్రతినిధులతో కలిసి హాస్టల్లో నీటి కొరత లేకుండా తగు చర్యలు తీసుకునే విధంగా సహకరించాలని ఎమ్మెల్యే వారిని కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యుఎస్ ఏఈ రమేష్,ఏకలవ్య పాఠశాల ఆర్సీ దీప,సొసైటీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి,కొత్తపేట సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్, నామాలపాడు సర్పంచ్ వర్స దీప,సిఐ రవీందర్ ఇతర ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ధర్మసాగర్‌కు ఎల్కుర్తి ఆదర్శం కావాలి!

## బెల్ట్ షాపులపై పంచాయతీ కొరడా ఝుళిపిస్తుందా?

## అక్రమ విక్రయాలతో యువత భవిష్యత్తు ప్రశ్నార్థకం

## గ్రామంలో మద్యం ఏరులై పారుతుంటే చూసీచూడనట్టేనా?




**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో, జూన్ 29 (జర్నలిస్ట్ వార్త):** మండల కేంద్రంలో అధికారికంగా ఒక వైన్ షాపు ఉండగా, దానికి అనుబంధంగా సుమారు 27 బెల్ట్ షాపులు యథేచ్ఛగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామంలోని కాలనీలు, శివారు ప్రాంతాల్లో సైతం మద్యం సులభంగా లభిస్తుండటంతో యువత మద్యానికి బానిసవుతోందని, దీనివల్ల అనేక కుటుంబాలు ఆర్థిక, సామాజిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఒకప్పుడు గ్రామాల్లో పెద్దలు చెప్పిన మాటకు విలువ ఉండేది. ఇప్పుడు ఇంటి వద్దకే మద్యం చేరుతుండటంతో యువత చదువులకు దూరమవడం, ఉపాధిని నిర్లక్ష్యం చేయడం, కుటుంబ కలహాలు పెరగడం, అప్పులు, రోడ్డు ప్రమాదాలు, నేరాలకు దారితీసే పరిస్థితులు ఏర్పడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అక్రమంగా నడుస్తున్న బెల్ట్ షాపులే ఈ పరిస్థితికి ప్రధాన కారణమని ఆరోపిస్తున్నారు.ఎల్కుర్తి చూపిన దారి...ఇటీవల ధర్మసాగర్ మండలంలోని ఎల్కుర్తి గ్రామంలో గ్రామపంచాయతీ, గ్రామ పెద్దలు, మహిళలు, యువత కలిసి బెల్ట్ షాపులపై ఉమ్మడిగా పోరాటం చేసి వాటిని మూసివేయించారు. గ్రామ ప్రయోజనాల కోసం ప్రజలు ఏకమైతే అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చని ఎల్కుర్తి నిరూపించింది. ఇప్పుడు అదే స్ఫూర్తితో ధర్మసాగర్ గ్రామపంచాయతీ కూడా ముందుకు రావాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది.

పంచాయతీ చొరవ చూపుతుందా?

గ్రామంలో బెల్ట్ షాపుల నిర్మూలనపై గ్రామపంచాయతీ పాలకవర్గం చర్చించినట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై అధికారిక నిర్ణయం వెలువడితే గ్రామ ప్రజలు స్వాగతిస్తారని, ముఖ్యంగా మహిళలు, యువత తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలుస్తోంది.యువతను కాపాడాల్సిన బాధ్యత ఎవరిది?అభివృద్ధి అంటే కేవలం సీసీ రోడ్లు, భవనాలు నిర్మించడం మాత్రమే కాదు. గ్రామంలో ఆరోగ్యకరమైన వాతావరణం, మద్యం రహిత సమాజాన్ని నిర్మించడం కూడా ప్రజాప్రతినిధుల బాధ్యతేనని సామాజిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. గ్రామంలోని ప్రతి వీధిలో బెల్ట్ షాపులు కొనసాగితే అభివృద్ధి మాటలకే పరిమితమవుతుందని వారు హెచ్చరిస్తున్నారు.

ప్రజల ఒక్కటే విజ్ఞప్తిఆదాయం కోసం బెల్ట్ షాపులు కాదు... యువత భవిష్యత్తు కోసం కఠిన నిర్ణయం కావాలి.గ్రామపంచాయతీ తీర్మానం చేసి, పోలీసులు, ఎక్సైజ్ శాఖలతో సమన్వయం చేసి అక్రమ మద్యం విక్రయాలను పూర్తిగా అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.ఇప్పుడు ధర్మసాగర్ గ్రామపంచాయతీ తీసుకునే నిర్ణయమే కీలకం. ఎల్కుర్తిలా ధైర్య నిర్ణయం తీసుకుంటే ధర్మసాగర్ కూడా మద్యం రహిత గ్రామంగా ఆదర్శంగా నిలిచే అవకాశం ఉందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రజల చెంతకే ఎస్ఐఆర్ సేవలు




**సికింద్రాబాద్/ జూన్ 29(జర్నలిస్ట్ వార్త):**
ప్రజల చెంతకే “ఎస్ఐఆర్“ సేవలు నిర్వహిస్తున్నామని బౌద్ధనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, అన్నారు. మాజీ డిప్యూటీ స్పీకర్ సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ళ పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు సోమవారం డివిజన్ పరిధిలోని కౌసర్ మాజిద్ పలు ప్రాంతాల్లో బిఎల్ఓ వసీం తో కలిసి పర్యటించి ఇంటి ఇంటికి తిరుగుతూ ఎస్ఐఆర్ ఫారం పత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా ఆయనా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయుకులు బాబా తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్లు తమ పేర్లను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి

### బిఆర్ఎస్ నాయకురాలు - మురారి స్మితా కోటేష్ గౌడ్

**సికింద్రాబాద్/ జూన్ 29 (జర్నలిస్ట్ వార్త);**
ఓటర్లు తమ పేర్లను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు మురారి స్మితా కోటేష్ పిలుపునిచ్చారు. మాజీ డిప్యూటీ స్పీకర్ సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ళ పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు సోమవారం తార్నాక డివిజన్ పరిధిలోని ఆండాళ్ మిక్సర్ లేన్, వైశాలి గార్డెన్స్, సాయి సదన్, సాయి సంతోషి పలు ప్రాంతాల్లో బిఎల్ఎ అఖిల తో కలిసి పర్యటించి ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు ఎస్ఐఆర్ కార్యక్రమం పై అవగాహన కల్పిస్తూ ఎన్యూమరేషన్ పాత్రలను అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటు హక్కు అత్యంత పవిత్రమైనదని ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాటు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



# శామీర్ పెట్ శ్రీ కట్ట మైసమ్మ ఆలయాన్ని దర్శించుకున్న బిఆర్ఎస్ సీనియర్ నాయకులు - మంద జగన్



**సికింద్రాబాద్/జూన్ 29(జర్నలిస్ట్ వార్త);**
ఈ రోజు శామీర్ పెట్ శ్రీ కట్ట మైసమ్మ ఆలయాన్ని బౌద్ధనగర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, సికింద్రాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షులు, మాజీ వార్డు మెంబర్ మంద జగన్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ ఆ యొక్క అమ్మవారి ఆశీస్సులు ఎల్లపుడూ ఉండాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ప్రతి ఒక్కరి కుటుంబంలో మంచి జరగాలని పేర్కొన్నారు.

# మొబైల్ సిగ్నల్ లేని గ్రామాల రైతులకు అండగా వ్యవసాయ శాఖ.

### -పందిపంపుల రైతులకు యూరియా బుకింగ్ చేసి ఎరువుల పంపిణీ.





**బయ్యారంజూన్ 29(జర్నలిస్ట్ వార్త);**బయ్యారం మండల వ్యవసాయ అధికారి కే.రాజు తన సిబ్బందితో రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ రైతులకు అవసరమైన సేవలను చేరవేయాలనే లక్ష్యంతో ప్రత్యేక చర్యలు చేపడుతోంది.అందులో భాగంగా మండలంలోని పందిపంపుల గ్రామంలో మొబైల్ సిగ్నల్ అందుబాటులో లేకపోవడంతో అక్కడి రైతులు యూరియా బుకింగ్ చేయడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ సమస్యను గుర్తించిన వ్యవసాయ శాఖ అధికారులు ఆదివారం ఆయా రైతులను కొత్తపేట రైతువేదికకు ఆహ్వానించి వారికి యూరియా బుకింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు.ఆదివారం బుక్ చేసిన యూరియా సంచులను సోమవారం రైతులకు పంపిణీ చేశారు.రైతుల సాగుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా అందడంతో రైతులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తూ వ్యవసాయ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.రైతుల అవసరాలను గుర్తించి వారికి సకాలంలో సేవలు అందించడమే తమ లక్ష్యమని మండల వ్యవసాయ అధికారి కే.రాజు తెలిపారు.మొబైల్ సిగ్నల్ లేని ఇతర గ్రామాల రైతులకు కూడా ఇదే విధంగా సహాయ సహకారాలు అందిస్తూ యూరియా బుకింగ్ చేసి పంపిణీ ప్రక్రియలో పూర్తి సహకారం అందించనున్నట్లు వారు పేర్కొన్నారు.రైతులకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ ప్రభుత్వ పథకాల ఫలాలు ప్రతి రైతుకు చేరేలా వ్యవసాయ శాఖ నిరంతరం కృషి చేస్తుందని అధికారులు తెలిపారు.

జర్నలిస్ట్ వార్త
మంగళవారం 30 జూన్ 2026

# మళ్లీ మొదటికొచ్చిన పశ్చిమసియా !

**జూన్ 29 (జర్నలిస్ట్ వార్త):**
ట్రంప్ ప్రంపచానికి పట్టిన పీడలాగా తయారయ్యాడు. అటు దేశ ప్రజలకు, ఇటు ప్రపంచ ప్రజలకు ఎప్పుడీ పీడ విరగడ అవుతుందా అని ఎదురు చూస్తున్నారు. శాంతి చర్చల అనంతరం ఒప్పందం చేసుకున్న తరవాత కూడా ఇరాన్‌పై మళ్లీ దాడులు చేయడంతో పశ్చిమాసియాను మళ్లీ యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి. ట్రంప్ చేస్తున్న ప్రకటనలకు, చర్యలకు పొంతన లేకుండ ఆపోయింది. దీంతో మళ్లీ యుద్ధం వస్తుందా అన్న భయంలో అనేక దేశాలు ఆందోళన చెందుతున్నాయి. ఇకపోతే ఇటలీవల చేసుకున్న ఒప్పందాన్ని కూడా ట్రంప్ ఖాతరు చేయలేదు. దీంతో అమెరికా, ఇరాన్ మధ్య అవగాహన ఒప్పందానికి పురిట్లోనే గండిపడింది. శనివారం మొదలైన పరస్పర దాడులు ఆదివారం మరింత ఉధృతం కావడంతో మళ్లీ పరిస్థితి మొదటికి వచ్చిందా అన్న ఆందోళన కలుగుతోంది. దాడులు ఆపకుంటే ఇరాన్‌ను భూమ్మీదే లేకుండా చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోమారు హెచ్చరించగా... తమ జోలికి వస్తే అమెరికాకు నరకం చూపిస్తామంటూ ఇరాన్ కూడా అంతేదీటుగా స్పందించింది. దీనితో పరిస్థితి మళ్లీ మొదటికి వస్తుందేమోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. హోర్ముజ్ జలసంధిలో తమ మార్గదర్శకాలకు విరుద్ధంగా ప్రయాణిస్తోందంటూ ఎవర్ లప్లీ అనే వాణిజ్య నౌకపై ఇరాన్ డ్రోన్ దాడి చేయడంతో ఉద్రిక్తత మొదలైంది. అవగాహన ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘిస్తోందంటూ.. శనివారం హోర్ముజ్ జలసంధికి సమీపంలో ఇరాన్‌లోని లక్ష్యాలపై అమెరికా యుద్ధ విమానాలతో దాడులు చేసింది. దీనితో గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపైకి ఇరాన్ డ్రోన్లు క్షిపణులను ప్రయోగించింది. అమెరికా దాడులపై ఇరాన్ దీటుగా స్పందించింది. కువైట్, బహ్రెయిన్‌లలోని అమెరికా స్థావరాలపై డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడింది. కువైట్‌లోని అలీ అల్ సలేం వైమానిక స్థావరం, బహ్రెయిన్ పోర్ట్ సల్మాన్ వద్ద ఉన్న అమెరికా ఐదో నావికాదళ స్థావరం సహా ఎనిమిది కీలక సైనిక కేంద్రాలను ధ్వంసం చేశామని ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్‌జీసీ) పేర్కొంది. అమెరికా చేసే ఎలాంటి దాడులకైనా మా స్పందన అత్యంత విధ్వంసకరంగా ఉంటుందని హెచ్చరించింది. కాగా, తమ దేశంవైపు వస్తున్న క్షిపణులు, డ్రోన్లను గగనతల రక్షణ వ్యవస్థలతో విజయవంతంగా అడ్డుకుంటున్నామని కువైట్ ప్రకటించింది. అయితే హోర్ముజ్ జలసంధిలో పనామా జెండాతో ప్రయాణిస్తున్న భారీ చమురు ట్యాంకర్ నౌక 'కికు'పై శనివారం రాత్రి దాడి జరిగింది. ఇది ఇరాన్ పనేనంటూ అమెరికా సెంట్రల్ కమాండ్ ఆదివారం తెల్లవారుజామున పర్షియన్ గల్ఫ్‌లోని ఇరాన్ దీవి 'ఖెష్మ్'పై, హోర్ముజ్ జలసంధి సమీపతీరంలోని సిరిక్, బందర్ ఈ లెంగే నగరాల్లో 10 ప్రాంతాలపై భారీస్థాయిలో దాడులు చేసింది. ఇరాన్ నిఘా, కమ్యూనికేషన్ వ్యవస్థలు, గగనతల రక్షణ వ్యవస్థలు, డ్రోన్లు, సముద్ర మందుపాతరల నిల్వ కేంద్రాలను ధ్వంసం చేసినట్టు ప్రకటించింది. ఈ దాడులకు సంబంధించి



38 సెకన్ల వీడియోను విడుదల చేసింది. పరస్పర దాడు లు కొనసాగుతున్నా హోర్ముజ్ జలసంధి మీదుగా నౌకల రాకపోకలు కొనసాగుతున్నాయని.. అమెరికా నౌకాదళం పూర్తి అప్రమత్తత ఉందని పేర్కొంది. అమెరికా, ఇరాన్ చర్చలకు మధ్యవర్తిగా ఉన్న పాకిస్థాన్.. తాజా ఉద్రిక్తతలను తగ్గించేందుకు ప్ర యత్నాలు మొదలుపెట్టింది. దీనిపై పాక్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ ఇరుదేశాల ప్రతినిధులను సంప్రదించారు. కాల్పుల విరమణ, అవగాహన ఒప్పందానికి కట్టుబడి ఉండాలని కరారు. ఇక యూరోపియన్ యూనియన్ విదేశాంగ విధానం చీఫ్ కాజా కల్లాస్, బహ్రెయిన్ విదేశాంగ మంత్రి రషీద్ కూడా ఇషాక్‌దార్‌తో మాట్లాడారు. కాగా కువైట్, బహ్రెయిన్‌లపై ఇరాన్ దాడులను గల్ఫ్ దేశాల కూటమి 'గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ (జీసీసీ)' ఖండించింది. వెంటనే దాడులు ఆపాలని విజ్ఞప్తి చేసింది. అమెరికా చేసే ప్రతీ దాడికీ తమ ప్రతిదాడి ఉంటుందని ఐఆర్‌జీసీ హెచ్చరించింది. కాల్పుల విరమణను అమెరికాయే ఉల్లంఘిస్తోందని, ఇది ఇలాగే కొనసాగితే శాంతి ఒప్పందం కోసం జరుగుతున్న దౌత్య ప్రయత్నాలన్నీ నిలిచిపోతాయని స్పష్టం చేసింది. ఈ మేరకు ఐఆర్‌జీసీ నావికాదళ కమాండర్ ప్రకటన చేశారు. గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా తప్పుబట్టారు. అవగాహన ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘిస్తోందని మండిపడ్డారు. ఇరాన్ మళ్లీ కాల్పు ల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడంతో మా సైన్యం దాడులు చేయాల్సి వచ్చింది. ఇరాన్ ఎప్పటికీ పాఠం నేర్చుకునేలా కనిపించడంలేదు. మా సహనానికి హద్దు అంటూ ఉంటుంది. అది దాటితే మేం సైన్యంతోనే పని పూర్తి చేయాల్సి వస్తుంది. అదే జరిగితే ఇక ఇరాన్ అనే దేశమే ఉండదని ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు. విదేశాల నుంచి భారత్‌కు సరుకు రవాణా చేస్తున్న ఏడు కార్గో నౌకలు గత మూడు రోజుల్లో హోర్ముజ్ జలసంధిని దాటాయి. వీటిలో 65 వేల టన్నుల రసాయన ఎరువులు తీసుకొస్తున్న రెండు నౌకలు శనివారం ఈ మార్గం గుండా వచ్చాయి. అంతకుముందు రోజు లక్ష టన్నులకు పైగా ముడి చమురుతో 'దేశ్ సురక్ష' ట్యాంకర్, 18,732 టన్నుల సరుకుతో 'ప్రభు పార్వతి' నౌక ఇదే మార్గం గుండా భారత్‌కు వచ్చాయి. ఇవిగాక మరో రెండు విదేశీ నౌకలు ఇదే మార్గంలో ప్రయాణించాయి. హోర్ముజ్ ద్వారా భారత్‌కు రావాల్సిన మరో 15కు పైగా నౌకలు తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో పర్షియన్ గల్ఫ్‌లో వేచి ఉన్నాయి. వీటిలో భారతీయ జెండా గల 10 నౌకలు ఉన్నాయి. వాటిలో నాలుగు ఎరువులను, మరొకటి ఇంధనాన్ని తీసుకురానున్నాయి. ఇప్పుడు ఉద్రిక్తతల కారణంగా పరిస్థితి ఎలా ఉంటుందో అన్న ఆందోళన కలుగుతోంది.

# కేతన్ అగర్వాల్ హత్యలో రోజుకో కొత్తవిషయం

## హత్యకు ముందు ప్రియుడితో మాట్లాడిన సియా గోయల్

**ముంబై, జూన్ 29 (జర్నలిస్ట్ వార్త):**
మహారాష్ట్ర పుణెకు చెందిన ప్రముఖ యువ వ్యాపారవేత్త కేతన్ అగర్వాల్ మర్డర్ కేసులో రోజుకో సంచలన విషయం వెలుగులోకి వస్తోంది. హత్యకు అరగంట ముందు సియా గోయల్.. తన ప్రియుడు చేతన్ చౌదరీకి ఫోన్ చేసి రహస్యంగా మాట్లాడినట్టు కాల్ డీటెయిల్ రికార్డ్స్ ఆధారంగా అధికారులు కనుగొన్నారు. మొబైల్ ఫోన్ల ఫోరెన్సిక్ విశ్లేషణ, సీడీఆర్ పరిశీలనలో ఈ విషయం బయటపడినట్టు తెలిపారు. ఈ కాల్‌ను కుట్రకు సంబంధించిన అత్యంత కీలక డిజిటల్ ఆధారంగా పోలీసులు భావిస్తున్నారు. ఈ సంభాషణలో కేతన్‌తో తానున్న ప్రాపర్ లొకేషన్‌ను ప్రియుడు చేతన్‌కు సియా తెలిపిందని, అక్కడ ఇతర పర్యాటకులెవరూ లేరని నిర్ధారించినట్లు అనుమానిస్తున్నారు. హత్యకు సంబంధించిన ప్రణాళికను దాచిపెట్టేందుకు మూడు నెలలుగా ఇరువురూ సోషల్ మీడియా ఎ÷-లాట్‌ఫామ్స్ వేదికగా షేర్ చేసుకున్న మెసేజ్‌లు, వాయిస్ కాల్స్ వివరాలను తొలగించినట్లు అధికారులు గుర్తించారు. సదరు డేటాను సైబర్ నిపుణుల సాయంతో వెలికితీసేందుకు యత్నిస్తున్నట్టు తెలిపారు. తొలగించిన సమాచారం, లొకేషన్ వివరాలు, ఇంటర్నెట్ ఐపీ అడ్రస్‌లను పోల్చి చూసి.. ఈ కుట్రను నిరూపించే దిశగా ఆధారాలు సేకరిస్తున్నట్టు




స్పష్టం చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. కేతన్, సియాలకు నవంబర్‌లో వివాహం జరగాల్సి ఉంది. కానీ ఈ పెళ్లి తనకు ఇష్టం లేకపోవడంతో సియా.. జూన్ 18న లోహగడ్ కోటకు కేతన్‌ను తీసుకెళ్లి కొండపై నుంచి తోసి హతమార్చింది. ఈ కేసులో ఆమె ప్రియుడు చేతన్ చౌదరీ కూడా నిందితుడిగా ఉన్నాడు. కాగా.. మే నెలాఖరులోనే సియా ఈ హత్యకు ఎ÷-లాన్ చేసినట్టు పోలీసులు భావిస్తున్నారు. జూన్ 14న తొలిసారి కేతన్‌ను కొండపై నుంచి తోసేందుకు యత్నించగా.. అదృష్టవశాత్తూ కేతన్ తనను తాను కాపాడుకుని ప్రాణాలతో బయటపడ్డారని వెల్లడించారు. ఆ సమయంలో పాము కనిపించడంతో అనుకోకుండా అలా జరిగిందని సియా కట్టుకథ అల్లినట్టు చెప్పారు. ఆ ప్రయత్నం విఫలం కావడంతో ఈ నెల 18న రెండోసారి పక్కా ప్రణాళికతో హత్యకు పాల్పడినట్లు పోలీసులు అనుమా నిస్తున్నారు. ఈ ఎ÷-లాన్‌లో కేతన్ తప్పించుకోకుండా ఉండేందుకు చేతన్ కూడా వారిని వెంబడించినట్టు దర్యాప్తులో వెల్లడైంది. గోయల్, చౌదరీల ఫోన్లను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం ఈ విషయాలు బయటపడినట్టు తెలుస్తోంది.

# తిరుమలలో ముగిసిన జేష్ట్యాభిషేకం

## మహాశాంతి హోమంతో ముగించిన వేదపండితులు



**తిరుమల, జూన్ 29 (జర్నలిస్ట్ వార్త)::::**తిరుమల శ్రీవారి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన జ్యేష్ఠాభిషేకం ఆదివారం ఘనంగా ముగిసింది. చివరిరోజు ఉభయదేవేరులతో కలిసి శ్రీమలయప్పస్వామివారు బంగారు కవచంలో పునః దర్శనమిచ్చారు. మళ్లీ జ్యేష్ఠాభిషేకం వరకు సంవత్సరం పొడవునా స్వామి, అమ్మవార్లు ఈ బంగారు కవచంతో ఉంటారు. ఈ సందర్భంగా ఉదయం శ్రీ మలయప్పస్వామివారు ఉభయ నాంచారులతో కలిసి శ్రీవారి ఆలయంలోని సంపంగి ప్రాకారానికి వేంచేపు చేశారు. ఆలయ అర్చకులు, వేదపారాయణదారులు శాస్త్రోక్తంగా మహాశాంతి హోమం నిర్వహించారు. శ్రీమలయప్ప స్వామివారికి, దేవేరులకు స్నపనతిరుమంజనం చేపట్టారు. అనంతరం స్వర్ణ కవచాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సహస్రదీపాలంకార సేవలో స్వామి, అమ్మవార్లు బంగారు కవచంలో దర్శనమిచ్చారు. ఆ తరువాత ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, టీటీడీ అదనపు ఈవో శ్రీ సిహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు శ్రీ సదాశివరావు, శ్రీమతి జానకి దేవి ,శ్రీమతి సుచిత్ర ఎల్లా, ఆలయ డెప్యూటీ ఈవో శ్రీ లోకనాథం తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే తిరుచానూరులో జరుగుతున్న శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం అమ్మవారు పద్మ పుష్కరిణిలో తెప్పపై విహరించి భక్తులకు దివ్య మంగళ దర్శనమిచ్చారు. అనంతరం గజవాహనంపై ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి, సహస్రనామార్చన, నిత్యార్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు పద్మ పుష్కరిణి వద్దనున్న నీరాడ మండపంలో శాస్త్రోక్తంగా అభిషేకం నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమైన తెప్పోత్సవంలో అమ్మవారు ఐదు చుట్లు తిరిగి భక్తులకు అభయప్రద దర్శనం ఇచ్చారు. అనంతరం గజవాహనంపై ఆలయ మాడవీధుల్లో విహరించి భక్తులకు ఆశీస్సులు అందించారు. సోమవారం వార్షిక తెప్పోత్సవాలు ముగియనున్నాయి. ఈ సందర్భంగా శ్రీ పద్మావతి అమ్మవారు పద్మ పుష్కరిణిలో ఏడు చుట్లు తిరిగి భక్తులను అనుగ్రహించనున్నారు. అనంతరం గరుడ వాహనంపై అమ్మవారు మాడవీధుల్లో విహరించి భక్తులను ఆశీర్వదించనున్నారు.

# ప్రభుత్వ స్కూళ్లలో సీట్ల కోసం రికమెండేషన్ అడిగే రోజులు వచ్చాయి: నారా లోకేశ్

**అమరావతి, జూన్ 29 (జర్నలిస్ట్ వార్త):**
వచ్చే ఏడాది ప్రైవేటు పాఠశాలల నుంచి కనీసం రెండు లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరాలన్నదే తన లక్ష్యమని, ఈ మార్పునకు 'షైనింగ్ స్టార్లే' బ్రాండ్ అంబాసిడర్లని రాష్ట్ర విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. భవిష్యత్తులో దేశం మొత్తం ఏపీ విద్యా నమూనా గురించే మాట్లాడుకోవాలని ఆకాంక్షించారు. గత విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను 'షైనింగ్ స్టార్స్' పేరుతో ఘనంగా సత్కరించారు. తాడేపల్లిలోని సీఎస్‌ఆర్ ఫంక్షన్ హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో టెన్త్ టాపర్లు 55 మందికి రూ. 30 వేల నగదు బహుమతి, ఇంటర్ టాపర్లు 61 మందికి ల్యాప్‌టాప్‌లు, పతకాలు అందజేశారు.

ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. "నిద్రలో కనిపించేది కల కాదు, మిమ్మల్ని నిద్రపోనివ్వనిదే నిజమైన కల. నిద్రపోకుండా మీరు పడిన కష్టమే మిమ్మల్ని షైనింగ్ స్టార్స్‌గా నిలబెట్టింది. మీరు గెలిచారు, నన్ను గెలిపించారు, మన విద్యావ్యవస్థను గెలిపించారు. ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకొచ్చారు. మీ పనితీరు వల్ల మంత్రిగా నాకు, 2 లక్షల మంది ఉపాధ్యాయులకు గౌరవం పెరిగింది" అని విద్యార్థులను ప్రశంసించారు. ప్రభుత్వ



పాఠశాలల్లో సీట్ల కోసం ఎమ్మెల్యేల సిఫార్సులు అడిగే రోజులు వచ్చాయని, మంగళగిరిలో ఒక తల్లి తనను నిడమర్రు స్కూలులో సీటు ఇప్పించాలని కోరిన విషయాన్ని గుర్తుచేశారు.

**విద్యారంగంలో సమూల మార్పులు**

విద్యాశాఖను వ్యవసాయంతో పోల్చిన లోకేశ్, ఫలితాలు వెంటనే రావని, నిరంతరం శ్రమిస్తేనే పంట చేతికొచ్చిన ఆనందం దక్కుతుందని అన్నారు. విద్యార్థులను కేంద్రంగా చేసుకుని అనేక సంస్కరణలు చేపట్టామని వివరించారు.

"గతంలో పాఠ్యపుస్తకాలపై ముఖ్యమంత్రి, మంత్రుల బొమ్మలుండేవి. నాకు ఆ ఫోటో పిచ్చి లేదు. అందుకే బ్యాగ్‌పై, బెల్ట్‌పై, గుడ్డపై, స్కూలులో ఎక్కడా బొమ్మలు లేకుండా చేశాం. పాఠశాలల్లో రాజకీయాలకు తావులేదని స్పష్టం చేశాం" అని తెలిపారు.

'వన్ క్లాస్-వన్ టీచర్', డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో స్టూడెంట్ కిట్, డొక్కా సీతమ్మ పేరుతో నాణ్యమైన మధ్యాహ్న భోజనం వంటి కార్యక్రమాలను ప్రస్తావించారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా సెంట్రలైజ్డ్ కిచెన్లు ఏర్పాటు చేసి భోజన నాణ్యతను మరింత పెంచుతామని హామీ ఇచ్చారు. మెగా డీఎస్సీ ద్వారా 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశామని, 'నో బ్యాగ్ డే' అమలు చేస్తున్నామని తెలిపారు.

**విలువలకే పెద్దపీట**

విలువలు లేని సమాజం ప్రమాదకరమని, అందుకే నైతిక విలువల కోసం చాగంటి కోటేశ్వరరావు గారిని సలహాదారుగా నియమించామని లోకేశ్ పేర్కొన్నారు. "అమ్మకు చెప్పలేని పని చేయొద్దు అనే ఆయన మాట చాలా శక్తివంతమైనది. మహిళలను గౌరవించడం ఇంటి నుంచే మొదలుకావాలి. తల్లికి వందనం వంటి కార్యక్రమాల ద్వారా ఆ మార్పునకు శ్రీకారం చుట్టాం" అని చెప్పారు. విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లు కావాలని కలలు కనడంతో పాటు, రాజకీయాల్లోకి వచ్చి సమాజాన్ని మార్చే నాయకులుగా కూడా ఎదగాలని ఆకాంక్షించారు.

# విజయ్ ప్రభుత్వం కూలడం ఖాయం

## అది ఎంతో దూరం లేదన్న మాజీ సిఎం స్టాలిన్



**చెన్నై, జూన్ 29 (జర్నలిస్ట్ వార్త):స్ :** తమిళనాడు రాజకీయాల్లో మరోసారి వేడి రాజుకుంది. డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ తాజాగా చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారితీశాయి. ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం ప్రభుత్వం ఐదేళ్ల పూర్తి పదవీకాలాన్ని పూర్తి చేయదని స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాబోయే మూడు నుంచి ఆరు నెలల్లో విజయ్ మైనారిటీ ప్రభుత్వం కూలిపోవచ్చని స్టాలిన్ అన్నారు. ఇది నిలబడే ప్రభుత్వం కాదంటూ ప్రకటన చేశారు. తాజాగా డీఎంకేలో కొందరు కార్యకర్తల చేరిక సందర్భంగా నిర్వహించిన సమావేశంలో స్టాలిన్ మాట్లాడారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం స్థిరంగా కనిపించడం లేదని, రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయని వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో పరిస్థితులు ఎలా మారతాయో వేచి చూడాలని అన్నారు. 'మా ప్రగతిశీల కూటమిలోని కొన్ని పార్టీల వ్యూహాత్మక పొత్తు, మద్దతు వల్లే ఈ టీవీకే ప్రభుత్వం మనుగడ సాగించగలుగుతోంది' అని స్టాలిన్ వ్యాఖ్యానించారు. ఇది అస్థిరమైన ఏర్పాటు. ఈ వాహనం ఏ కూడలిలో అకస్మాత్తుగా ఆగిపోతుందో మనకు తెలియదు అందుకే నేను మీకు చెబుతున్నాను.. ఎన్నికలు ఎప్పుడైనా రావచ్చు. అవి మూడు నెలల్లో జరగవచ్చు, లేదా ఆరు నెలల్లో జరగవచ్చు. ఐదేళ్ల కాలం పాటు వేచి ఉండే స్థితిలో మనం లేము. ఎలాంటి రాజకీయ పరిస్థితికైనా నూటికి నూరు శాతం మనం సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు స్టాలిన్ సూచించారు.